# భద్రాద్రి జడ్పీ చైర్మన్‌గా 'కంచర్ల'

- కోరం కనకయ్య రాజీనామాతో స్థానం ఖాళీ
- వైస్ చైర్మన్‌గా ఉన్న కంచర్లకు చైర్మన్ హోదా
- టేకులపల్లి జడ్పీటీసీ స్థానం కూడా ఖాళీ..

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కంచర్ల చంద్రశేఖరరావును వరించింది. నాలుగేళ్లుగా జడ్పీ వైస్ చైర్మన్‌గా ఉన్న కంచర్ల శనివారం జడ్పీ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి వరకూ జడ్పీ చైర్మన్‌గా ఉన్న కోరం కనకయ్య ఇల్లెందు ఎమ్మెల్యేగా విజయం సాధించి చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న కంచర్ల చంద్రశేఖరరావు ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో జడ్పీ కార్యాలయంలో శనివారం కంచర్లకు జడ్పీ సీఈవో విద్యాలత ప్రొసీడింగ్‌ను అందజేశారు. దీంతో ఆయన కార్యాలయ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ప్రొటోకాల్ ప్రకారం గన్‌మెన్‌లతోపాటు క్యాంపు కార్యాలయం కూడా చైర్మన్ ఆధీనంలో ఉండనుంది. కాగా, జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కంచర్ల.. కలెక్టర్ ప్రియాంక మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

**కనకయ్య రాజీనామా ఆమోదంతో..**

ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన కోరం కనకయ్య ఇటీవలే తన తన రాజీనామాను కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ అతడి రాజీనామాను ఆమోదించి వైస్ చైర్మన్ కంచర్లకు జడ్పీ చైర్మన్‌గా ప్రొసీడింగ్ ఇచ్చారు. దీంతో టేకులపల్లి జడ్పీటీసీ స్థానం కూడా ఖాళీ అయింది.

**1970 నుంచి రాజకీయాల్లో ఉన్నా: కంచర్ల**

1970 నుంచే రాజకీయాల్లో ఉన్నానని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1991లో కొత్తగూడెం సొసైటీ చైర్మన్‌గా పనిచేశానని, చాలా పదవుల్లో పనిచేసిన అనుభవం ఉందని అన్నారు. అభివృద్ధిలో జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.



జడ్పీ చైర్మన్‌గా కంచర్లకు ప్రొసీడింగ్ అందజేస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత



హెచ్‌సీఎల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌ని సన్మానిస్తున్న కళాశాల కరస్పాండెంట్ ధాత్రి

# ప్రణాళికతో విజయాలు సాధ్యం

**ఎస్‌బీఐటీ శిక్షణలో హెచ్‌సీఎల్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్**

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 9 : విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదవడంతోపాటు ప్రణాళికతో ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చని హెచ్‌సీఎల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ అన్నారు. శనివారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో పలు మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులతో విద్యార్థులకు శిక్షణతోపాటు ముఖాముఖి నిర్వహించారు. టీసీఎస్ రీజియన్ హెడ్ రిచర్డ్‌కింగ్, బిర్లాసాఫ్ట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అబుబాకర్, సర్వీస్‌నౌ డైరెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగ పురోగతి, ఉద్యోగ అవకాశాల గురించి, ప్రస్తుతం ఉద్యోగాలు సాధించాలంటే వృత్తి నైపుణ్యాలు ఎలా ఉండాలో వివరించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలకు గుర్తుగా స్వర్ణభారతి ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు దేశవిదేశాల్లోని ప్రముఖ బహుళ జాతి కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ సాధించి స్థిరపడేలా కృషి చేస్తున్నామన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ ప్రవీణ్ కుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

## కేటీపీఎస్ ఆరోదశ 11వ యూనిట్‌లో..

# విద్యుదుత్పత్తి పునఃప్రారంభం



పాల్వంచలోని కేటీపీఎస్ ఆరో దశ 11వ యూనిట్

పాల్వంచ, డిసెంబర్ 9: జిల్లాలోని పాల్వంచలో ఉన్న కేటీపీఎస్ ఆరో దశ 11వ యూనిట్‌లో 500 మెగావాట్ల విద్యుదుత్పత్తిని అధికారులు తిరిగి ప్రారంభించారు. నవంబర్ 16 నుంచి యూనిట్‌లో ఉత్పత్తిని నిలిపివేసి వార్షిక మరమ్మతులు చేపట్టారు. అన్ని విభాగాల్లో 22 రోజులపాటు పనులన్నీ పూర్తి చేసి యూనిట్ సక్రమంగా నడుస్తుందని నిర్ధారణకు వచ్చిన తర్వాత ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. వార్షిక మరమ్మతుల సమయంలో జెన్కో డైరెక్టర్ లక్ష్మయ్య ఈ ప్లాంట్‌ను సందర్శించి అధికారులతో సమీక్షించారు. శనివారం ఉదయం 7 గంటలకు యూనిట్‌లో బాయిలర్ లైటప్ చేశారు. అనంతరం యూనిట్‌ను రన్నింగ్‌లోకి తీసుకొస్తూ సాయంత్రం 5:30 గంటలకు సింక్రనైజేషన్ చేసి తిరిగి ఉత్పత్తి చేపట్టారు. అర్ధరాత్రి కల్లా యూనిట్‌లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి తీసుకొచ్చినట్లు సీఈ ఎం.ప్రభాకర్‌రావు తెలిపారు.

**జనరేటర్ పక్కన మంటలు**

ఓవరాల్ పనుల సమయంలో జనరేటర్ చుట్టుపక్కల యూనిట్‌కు సంబంధించిన ఆయిల్ పడిపోయింది. దీంతో వేస్టు మెటీరియల్‌కు ప్రమాదశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి వాటిని ఆర్పివేశారు.

# కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ కిటకిట



ప్రయాణికులతో రద్దీగా ఉన్న కొత్తగూడెం బస్టాండ్

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 9: మహాలక్ష్మి పథకంలో ప్రారంభంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొత్తగూడెంలో కార్యరూపం దాల్చింది. శనివారం ప్రారంభించిన ఈ పథకం వల్ల బస్టాండ్‌లోని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సుల కోసం మహిళలు ఎదురుచూశారు. మధ్యాహ్నం నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ప్రయాణికులకు సమాచారం అందగా నిర్ణీత సమయానికి ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుకున్నారు. జమ్మికుంటకు చెందిన కొంత మంది మహిళా ప్రయాణికులు హనుమకొండ డిపో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగా తమకు ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదంటూ సదరు కండక్టర్ వారిని అనుమతించలేదు. సుమారు రెండుగంటలపాటు వారు వేచి చూశారు. కలెక్టర్ వచ్చి లాంఛనంగా ప్రారంభించిన తరువాత మహిళా ప్రయాణికులను అనుమతించారు.

# ఆధార్ చూపించి ప్రయాణించొచ్చు

- జిల్లాలోని విద్యార్థినులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- ఇప్పటికే ఖమ్మం రీజియన్‌లో రోజుకు 50 వేల మహిళల ప్రయాణం
- ఈ పథకంతో మహిళా ప్రయాణికుల మరింత సంఖ్య పెరుగుతుంది
- 'మహాలక్ష్మి' పథకం ప్రారంభంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు



జీరో టికెట్‌ను చూపిస్తున్న భద్రాద్రి కలెక్టర్, మహిళా వైద్యాధికారులు, సిబ్బంది

ఖమ్మం/ కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శనివారం ప్రారంభమైంది. ఈ రెండు జిల్లా కేంద్రాల్లోని బస్టాండ్లలో ఆయా జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక జెండాలు ఊపి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని, వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతమున్న లెక్కల ప్రకారం ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో ప్రతిరోజూ 40 వేల నుంచి 50 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని అన్నారు. మహాలక్ష్మి పథకంతో ఈ సంఖ్య పెరుగుతుందని అన్నారు. ఆర్టీసీ ఆర్‌ఎం సీహెచ్ వెంకన్న మాట్లాడుతూ.. వారం తరువాత జీరో వ్యాల్యుయేషన్ టికెట్లు ఇస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు కిషన్‌రావు, విద్యాచందన, సుమ, శ్రీనివాసరావు, పవిత్ర, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు సద్వినియోగం చేసుకోండి**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. రామవరంలోని మాతా, శిశు సంక్షేమ కేంద్రంలో ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, మహిళా వైద్యాధికారులు, సిబ్బంది కలిసి రామవరం నుంచి బస్సులో ప్రయాణించి కొత్తగూడెం బస్టాండ్‌కు చేరుకున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్‌కార్డుగానీ, మరేదైనా గుర్తింపుగానీ చూపించి ప్రయాణించవచ్చునని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాపు సీతాలక్ష్మి, శిరీష, కుమారస్వామి, భవానీ ప్రసాద్, బాణాల వెంకటేశ్వరరావు, మోరె రూప, మునిగడప పద్మ, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'ఆరోగ్యశ్రీ' పరిమితి రూ.10 లక్షలు

- 1383 రోగాలకు చికిత్సలు, సర్జరీలు, 289 రుగ్మతలకు వర్తింపు
- పరిమితి పెంపు కార్యక్రమ ప్రారంభంలో రెండు జిల్లాల కలెక్టర్లు



ఖమ్మంలో ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం సిటీ, డిసెంబర్ 9: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం లాంటిదని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక అన్నారు. ఈ పథకం కింద ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల పరిమితి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచగా.. ఆ పెంపు అమలు కార్యక్రమాన్ని శనివారం ఆయా జిల్లా కేంద్రాల్లో వారు ప్రారంభించారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం 1383 రోగాలకు చికిత్సలు, సర్జరీలు, 289 వైద్య రుగ్మతలకు వర్తిస్తుందని అన్నారు. అనంతరం ఈ పథకం పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అధికారులు మాలతి, రాజేశ్వరరావు, విద్యాచందన, సుమ, మాధవరావు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెంలో..**

కొత్తగూడెంలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు శనివారం నుంచి అమలులోకి వచ్చిందని అన్నారు. భద్రాద్రి జిల్లాలో 9 ప్రభుత్వ, 4 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ పథకం కింద సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, సీతాలక్ష్మి, డాక్టర్ శిరీష, డాక్టర్ కుమారస్వామి, భవానీ ప్రసాద్, వీవీ రావు, జమలయ్య, మోరె రూప తదితరులు పాల్గొన్నారు.

# రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి

**సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజు**

రామవరం, డిసెంబర్ 9: సింగరేణి సంస్థలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని చేయాలని ఏరియా జీఎం శాలెం రాజు సూచించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లిలోని కిష్టారం ఓసీలో నూతనంగా రూ.48.17 లక్షలతో కొనుగోలు చేసిన షానీమేక్ కంపెనీ 1 క్యూబిక్ మీటర్ షావెల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయడానికి ఈ యంత్రాన్ని సమకూర్చినట్లు తెలిపారు. ఈ ఏడాది కిష్టారం ఓసీకి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు నరసింహారావు, దుర్గాప్రసాద్, రమణారావు, రామకృష్ణ, కిశోర్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616